
సాక్షి పల్నాడు
గురువారం । 29 । ఆగస్టు । 2024



వాసవీ మాతకు వజ్రాల వడ్డాణం

కారెంపూడి: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వజ్రాలు పొదిగిన బంగారు వడ్డాణాన్ని వ్యాపారవేత్త ఏచూరి మణిదీప్ దంపతులు బుధవారం బహూకరించారు.



సాగు నీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 7,508 క్యూసెక్కులు విడుదల చేశారు.

నిదానంపాటి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



పిట్టలవానిపాలెం: గోకరాజుపల్లె బోయినవారిపాలెం శివారు దివాన్ తోట గ్రామంలో కొలువై ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకను బుధవారం వైభవంగా నిర్వహించారు.



కఠిన చట్టాలు చేయాలి

చదువుకుంటున్న, ప్రాక్టీసు చేస్తున్న డాక్టర్ల రక్షణ కోసం ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలి. వాటిని పకడ్బందీగా అమలు చేయాలి. సమాజంలో వైద్యులకు తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. ప్రజలు కూడా డాక్టర్లు తమ కోసమే పనిచేస్తున్నారనే విషయం గ్రహించాలి. కోల్‌కతా ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా. ఇలాంటివి మరోసారి జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది.

- డాక్టర్ రామిరెడ్డి వినోద్‌కుమార్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, నరసరావుపేట



ప్రత్యేక రక్షణ చర్యలు అవసరం

రోగాలతో బాధపడే వారికి మరో జన్మనిచ్చే వారే డాక్టర్లు. కోల్‌కతా ఘటన చాలా బాధాకరం. ఇలాంటివి వైద్యులకే కాదు ఇంకెవరికీ జరగకూడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి. కఠిన చట్టాలు తీసుకొచ్చి అమలు చేస్తే నిందితులకు హెచ్చరికగా ఉంటుంది. ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారిని అరెస్టు చేసి చాలా కఠినంగా శిక్షించాలి.

- డాక్టర్ కొండారెడ్డి త్రివేణి, గైనకాలజిస్టు, నరసరావుపేట



భాషాభిమానుల పెదకూరపాడు!

- ఎందరో కవులకు పుట్టినిల్లుగా ప్రఖ్యాతి
- తెలుగు వికాసానికి ఇక్కడి ప్రముఖుల కృషి
- నేడు తెలుగు భాషా దినోత్సవం

జాతి మనుగడలో మాతృభాషది ఎంతో కీలక పాత్ర. అందునా తెలుగు వంటి సుమధుర భాష విస్తరించేలా ఎందరో మహనీయులు తమవంతు కృషి చేశారు. వారిలో తెలుగు భాష పురోభివృద్ధికి గిడుగు రామమూర్తి చేసిన సేవలు అజరామరం. వాడుక భాషకు జీవం పోసిన ఆయన జయంతి సందర్భంగా గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకుంటున్న తరుణమిది. తెలుగు వెలిగేలా భాష, సాహితీ సేవ చేస్తున్న ఎందరో ప్రముఖులకు పెదకూరపాడు ప్రాంతం చిరునామాగా నిలిచింది. వారి సేవలతో భాష వెలుగులీనుతోంది.



పెదకూరపాడు: పెదకూరపాడు ప్రాంతం కవులు, రచయితలు, సాహితీవేత్తలకు పుట్టినిల్లు. నేటి తరం యువత కూడా తెలుగు భాషాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన కవిబ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్య, కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతి శ్రీ , ఆధునిక కవి దర్శి శేషారావు, అమెరికాలో ఉంటున్న మాగులూరి భానుప్రకాష్ ఈ కోవలో ముందున్నారు.

కవిబ్రహ్మ కలం నుంచి ఎన్నో రచనలు



కవిబ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్య 1911లో ఏప్రిల్ 1వ తేదీన పెదకూరపాడులో సామాన్యరైతు కుటుంబంలో జన్మించారు. 1933లో చిట్టిగూడూరులో ఉన్న శ్రీ నారసింహ సాంస్కృతిక కళాశాలలో ఉభయభాషా ప్రవీణ పూర్తి చేశారు. కొవ్వూరు విద్యాపీఠంలో చేరారు. కొంత కాలం తర్వాత విజయనగరం మహారాజా వారి కళాశాలలో సాహిత్య విద్యాప్రవీణ చదివారు. అనంతరం పండితుడిగా ఉద్యోగంలో చేరారు. 1935లో సంపూర్ణ కవిగా వ్యాసాలు రాశారు. వీరభారతం, మగువ మాంచాల, నాయకురాలు, అలరాజు రాయబారం, రుద్రమదేవి, క్షేత్రలక్ష్మి, ప్రేమాలోకము తదితర కావ్యాలు, నవలలు, నాటకాలు, శతకాలు, గేయకథలు, హరికథలు రచించారు. ఆయనను కవిబ్రహ్మగా ఈ ప్రాంత ప్రజలు కీర్తిస్తుంటారు.

భాషా వారధి భానుప్రకాష్



వృత్తిరీత్యా 18 సంవత్సరాలుగా అమెరికాలో నివాసం ఉంటున్నా పుట్టిన గడ్డపై, అమ్మ భాషపై మక్కువతో పురోభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు మాగులూరు భానుప్రకాష్. పెదకూరపాడు మండలం హుస్సేన్ నగరం గ్రామానికి చెందిన ఆయన తానా తెలుగు విభాగం పాఠశాలల అధ్యక్షుడిగా, బృహత్తర వాషింగ్టన్ తెలుగు సంఘం కార్యదర్శిగా, ఆటాలో శాస్త్రీయ నృత్య విభాగం సయ్యంది పాదం నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషాభివృద్ధికి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నారు. మాగులూరు ఫౌండేషన్ ద్వారా తెలుగు బాల వికాస్ కేంద్రాలు వందల సంఖ్యలో ఏర్పాటు చేశారు. అమెరికాలో తెలుగు సంఘాలు, రంగస్థల ప్రముఖులతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమెరికాలో ఉన్న వేల మంది విద్యార్థులకు మాతృ భాష గొప్పతనం చాటి చెబుతున్నారు. తెలుగు భాషాభివృద్ధికి తన వంతుగా విశేష కృషి చేస్తున్నారు.

శరత్‌చంద్రుడి సాహితీ సేద్యం



పెదకూరపాడు గడ్డపై పుట్టిన మరో సాహితీవేత్త కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతి శ్రీ. బీఏ చేసి జర్నలిస్టుగా, సంపాదకుడిగా, అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2001లో వేమన, సుమతి శతకాలకు సంగీత బాణీలు అద్ది మంగళగిరికి చెందిన ప్రముఖ సంగీత దర్శకులు గోపాలం సహకారంతో సీడీలు తయారు చేశారు. ప్రముఖ సాహితీవేత్త జీవీ నరసింహారావు సహాయంతో పుస్తకం రచించారు. 1946లో తెనాలిలో ఏర్పాటు చేసిన అభ్యుదయ సాహిత్య పాఠశాలలోని పుస్తకాలు సేకరించి విశాలాంధ్ర సహకారంతో ఆంధ్ర అభ్యుదయ సాహిత్య పాఠాలు రచించారు. ఈ గ్రంథాన్ని ప్రముఖ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి ఆవిష్కరించారు. సామాజిక అంశాలు, ప్రజా ఉద్యమ నేపథ్యంలో అగ్నిసుమాలు, ప్రతిజ్ఞ కవితా సంపుటి వంటి పుస్తకాలు రచించారు. శారద కథలు, తిలక్ సాహితీ సందర్శనం పుస్తకాలకు సంపాదకుడిగా వ్యవహరించారు. తెలుగు భాషాభివృద్ధికి అభ్యుదయ రచయితల సంఘం ద్వారా కృషి చేస్తున్నారు.

ప్రజలను జాగృతం చేస్తున్న ఆధునిక కవి....



ఆధునిక కాలంలో సామాజిక అంశాలపై తన కవితలతో ప్రజలను జాగృతం చేస్తున్న కవి దర్శి శేషారావు. అధ్యాపకుడిగా, జర్నలిస్టుగా, ప్రకృతి వ్యవసాయం చేసే రైతుగా, ప్రజాకవిగా దర్శి శేషారావుకు ఈ ప్రాంతంలో పేరుంది. కార్మిక వర్గాల హక్కులపై, పేదవాడి జీవన విధానంపై, కౌలు రైతుల కష్టాలపై శేషారావు నిత్యం కవితల రూపంలో తన వైఖరి చాటుతూనే ఉన్నారు. జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో తన కవితలకుగాను అవార్డులు అందుకున్నారు.



సన్మానం అందుకుంటున్న శేషారావు

న్యూస్‌రీల్

జూలకల్లు యువతి అదృశ్యం సుఖాంతం

- బంధువుల ఇంట్లో క్షేమంగా ఉన్నట్లు వెల్లడి



పిడుగురాళ్ల రూరల్: పల్నాడు జిల్లా జూలకల్లు గ్రామంలో అదృశ్యమైన యువతి మనీషా ప్రాణాలతోనే ఉన్నట్లు తేలింది. కొంతమంది వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఆమె అదృశ్యమైన సంగతి తెలిసిందే. దీంతో మంగళవారం నుంచి పోలీసులు, బంధువులు, కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు బుధవారం ఉదయం తాను నరసరావుపేటలోని బంధువుల ఇంట్లో ఉన్నానని కుటుంబ సభ్యులకు ఆమె తెలిపింది. వెంటనే పోలీసులు యువతి వద్దకు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాగార్జునసాగర్ కెనాల్, ఇంట్లో సూసైడ్ నోట్ పెట్టడం.. రేషన్‌షాపు నిర్వహణను వదులుకోవాలంటూ కొంతమంది వేధించినట్లు వాటిలో పేర్కొనడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు.

అక్రమ కట్టడం కూల్చివేత



తెనాలి అర్బన్: వాహబ్ చౌక్‌లో అక్రమంగా నిర్మించిన గదిని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చి వేశారు. వాహబ్‌చౌక్‌లో షేక్ జిలానీ తన పాత భవనంపై మరో గదిని నిర్మించారు. దానికి మున్సిపల్ అనుమతులు లేవు. ఫిర్యాదులు కూడా రావడంతో దాన్ని కూల్చివేసినట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ జెడ్. సుధాకర్ తెలిపారు.

వైభవంగా శిఖర ప్రతిష్ఠ



తెనాలి రూరల్: ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వారి వైకుంఠపురం దేవస్థానంలో బుధవారం కళాన్యాసపూర్వక శిఖర ప్రతిష్ఠ, మహా సంప్రోక్షణ ఘనంగా నిర్వహించారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం ఉదయం 7.45 గంటలకు శిఖర ప్రతిష్ఠ జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 11 గంటలకు ఉత్సవమూర్తులకు విశేష పూజ, కుంభ, గో, ధాన్య పూజలు, కన్యాదర్శనం, మహాహారతి నిర్వహించారు. అనంతరం మహా సంప్రోక్షణ, మహా పూర్ణాహుతి, శ్రీ హనుమత్ లక్ష్మణ సీతా రామస్వామి, శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ రుక్మిణీ సమేత శ్రీ కృష్ణ స్వామి శాంతి కల్యాణాలను కనుల పండువగా జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ సహాయ కమిషనర్ ఎం. తిమ్మానాయుడు, పాలక మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

యార్డుకు 57,286 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 57,286 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 54,615 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 15,700 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,600 వరకు ధర పలికింది. తాలు రకానికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,873 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సృజనకు ప్రేరణ

ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల రూపకల్పనకు ఆహ్వానం

- బాల శాస్త్రవేత్తలకు బంగారు అవకాశం
- సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు
- ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులకు అవకాశం
- అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీ కోసం రూ.10 వేల నగదు బహుమతి
- రాష్ట్ర . జాతీయ స్థాయి ప్రదర్శనలకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25 వేలు

విద్యార్థుల చిట్టి బుర్రల్లో ఎన్నో సృజనాత్మక అంశాలు దాగి ఉంటాయి. తాము ఉంటున్న పరిసరాలు, నేర్చుకున్న విషయాలు, చూసిన సమస్యలకు పరిష్కార మార్గాలను కనిపెడుతూ ఉంటారు. వివిధ విషయాలపై వారికున్న అవగాహన కొత్త ఆవిష్కరణలకు దారి చూపుతుంది. అయితే వారిలోని సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ఒక వేదిక కావాలి. త్వరలో జరగనున్న ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ వేడుక వారికి ఈ దిశగా కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు.

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ సరికొత్త వేదికను రూపొందించారు. దీనిలో అన్ని ప్రభుత్వ, అనుబంధ విద్యాసంస్థల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేటు మేనేజ్‌మెంట్ల పాఠశాలల విద్యార్థుల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు. దీని కోసం 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు తరగతికి ఒకటి చొప్పున ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులను నమోదు చేసుకునే అవకాశం ఉంది.



ఇన్‌స్పైర్ మనాక్‌లో విద్యార్థి ప్రాజెక్ట్ ప్రదర్శన

ప్రాజెక్టులను పంపండిలా...

www. inspireawards-dst.gov. in వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా సెప్టెంబర్ 15వ తేదీలోపు పాఠశాల విద్యార్థులు వారి ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు వీలుగా రూ. 10 వేల పారితోషికం అందిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ. 25 వేల వరకు తమ ప్రాజెక్టును మెరుగు పరుచుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులు కేటాయిస్తుంది. ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్‌లో నిర్వహించనున్న సుకుర కార్యక్రమంలో ప్రదర్శనకు అవకాశం ఉంటుంది.

దరఖాస్తు చేసుకునే విధానం..

తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటేషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను పరిష్కరించేలా ఐడియా ఉండాలి. తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపికచేసి అవసరమైన ప్రాజెక్టును రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి వివరాలు నమోదు చేయాలి. విద్యార్థికి సంబంధించిన బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ నెంబరు ఎంటర్ చేయాలి. విద్యార్థి ప్రాజెక్టు గురించి సంక్షిప్తంగా రాతపూర్వకంగా పొందుపరిచి, సంబంధిత వెబ్‌సైట్‌లో ఎంటర్ చేయాలి. ప్రాజెక్టు పేరు శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టుల ఎంపిక రెండు నెలల్లో పూర్తిచేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్రస్థాయి ఎంపికకు పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టుకు ప్రయోగం నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ. 10వేలు జమ చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది.

ఆవిష్కరణలు నిత్య'కృత్యం'



ఇన్‌స్పైర్ మనాక్ లోగో

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ప్రైవేట్ తదితర పాఠశాలలు 2,047 వరకు ఉన్నాయి. వీటిలో 3,17,342 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత ఏడాది ఇన్‌స్పైర్ మనాక్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా 126 మందికి రూ.10 వేల చొప్పున అందజేసి ప్రాజెక్టులతో ప్రదర్శనకు ఆహ్వానించింది. విద్యార్థులు నమూనాలను తయారు చేసి జిల్లా స్థాయి ప్రదర్శనలో ప్రదర్శించి ప్రతిభ కనబరిచారు. వాటిలో 13 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. వాటిని తయారు చేసిన విద్యార్థుల ఖాతాల్లో ఈ ఏడాది జనవరి నెలాఖరున రూ.10 వేల చొప్పున ప్రాజెక్టు రూపకల్పనకు నగదు జమ చేశారు.

ప్రతిభను ప్రోత్సహించేందుకు..



ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి జిజ్ఞాస గల విద్యార్థులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాం. ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ ప్రాజెక్టు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సైన్సు ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులతో కలిసి ఐడియాలజీ తరగతులు నిర్వహిస్తున్నాం. పాఠశాలల హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవ చూపాలి. జిల్లా నుంచి అత్యధికంగా నామినేషన్లు నమోదయ్యేలా చూడాలి.

–ఎం. వెంకటేశ్వర్లు, డీఈఓ, పల్నాడు

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయండి

జిల్లా అధికారులతో కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

నరసరావుపేట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌ల జిల్లా పర్యటన కోసం ఏర్పాట్లు పటిష్ఠంగా చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటే వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వారు ఈ నెల 30వ తేదీన జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో పి.అరుణ్‌బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. కాకాని జేఎన్‌టీయూఎన్ క్యాంపస్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అవసరమైన మొక్కలను సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆయన సూచించారు. దీంతోపాటు జిల్లావ్యాప్తంగా గ్రామాలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర చోట్ల ఏకకాలంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మొక్కలు సకాలంలో సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి తాగునీరు వసతి కల్పన, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

నరసరావుపేట రూరల్: కాకాని సమీపంలోని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎం, డిప్యూటీ సీఎంల పర్యటనకు చేస్తున్న ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ పి.అరుణ్‌బాబు పరిశీలించారు. వన మహోత్సవం జరిగే ప్రాంతంతోపాటు హెలిప్యాడ్, సభాస్థలి, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె, జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు, ఆర్ అండ్ బీ అధికారి రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– గుంటూరు డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: జిల్లాలో ప్రస్తుతం నమోదవుతున్న జ్వరాల కేసులపై ప్రజలు, వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకుని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆమె తెలిపారు. పంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బందితో సమన్వయంతో పరిశుభ్రతను మెరుగుపరచాలని ఆమె తెలియజేశారు. ఫ్రైడేను డ్రై డేగా పాటించాలని, సాయంత్రం పూట వేపే పొగ పెట్టడం వల్ల ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. చీకటి పడే సమయానికి ముందు తలుపులు, కిటికీలు మూసివేయాలని, పూర్తి గా శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులను ధరించాలని సూచించారు. ఎక్కడ నీరు నిల్వ ఉంటే అక్కడ దోమలు గుడ్లు పెట్టి సంతానాన్ని పెంచుకుంటాయని వివరించారు. పూల కుండీలు, కూలర్లు, తాగి పడేసిన టీ కప్పులు, పాత టైర్లలో నీటిని తొలగించాలని వెల్లడించారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌ను వారానికి ఒక్కసారి తప్పనిసరిగా శుభ్రపరచుకోవాలని చెప్పారు. పాత రోళ్లు, పాత కుండలలోని నీటిని తొలగించాలని తెలిపారు. దోమల నుంచి రక్షణకు తెరలు వాడాలని సూచించారు.

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

నగరంపాలెం: భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవ కారాగారశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ తీర్పు వెలువరించారు. వివరాలు.. సత్తెనపల్లి టౌన్ ఎస్‌ఎస్‌పీ క్యాంప్ కాలనీలో భార్యాభర్తలైన ఎం.అంకమ్మ, ఎం.శ్రీనివాసరావు నివాసం ఉంటున్నారు. శ్రీనివాసరావు లస్కర్‌గా పని చేస్తున్నాడు. మద్యం మత్తులో భార్యను వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో 2020 జూలైలో ఆమెను అతి కిరాతకంగా కత్తితో హత్య చేశాడు. అప్పటి సీఐ విజయ్‌చంద్ర కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేశారు. దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బుధవారం కోర్టులో సాక్షులను హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో శ్రీనివాసరావుకు యావజ్జీవ శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా జడ్జి నీలిమ తీర్పు వెలువరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లపు కృష్ణ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

వెంటనే శిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఉండాలి



కోల్‌కతా తరహా దారుణాలకు పాల్పడిన వ్యక్తులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా వెంటనే కఠినంగా శిక్షించాలి. దీనికోసం అవసరమైన నూతన చట్టాలు తీసుకురావాలి. హాస్పిటళ్లు, మెడికల్ కళాశాలలకు ప్రత్యేకమైన డ్యూటీ రూమ్‌లు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలి. ఏదైనా ఘటన జరిగితే బటన్ నొక్కితే వెంటనే సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి చేరుకునేలా ఏర్పాట్లు ఉండాలి.

– డాక్టర్ యండమూరి నిఖిలేష్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నరసరావుపేట



ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన కలచివేసింది. దోషులకు కఠిన శిక్షలు అమలయ్యేలా చూడాలి. మహిళా ఉద్యోగులకు పని చేసే కార్యాలయాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలి. నిబంధనలు అమలు అయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించే వారిలో కూడా మార్పు రావాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు చిన్నతనం నుండే దీనిపై అవగాహన పెంచాలి. క్రమశిక్షణగా పిల్లలు పెరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

– సరిత, ఎంఎల్‌హెచ్‌పీ, నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ

క్లుప్తంగా

ప్రధాని, కేంద్ర మంత్రులకు ఎంపీ లావు కృతజ్ఞతలు

నరసరావుపేట: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి చెల్లించాల్సిన బకాయిలతో పాటు అవసరమైన నిధులను ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయడంపై టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమైన ఈ ప్రాజెక్టుకు మేలు చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

266 పరుగులు సాధించిన కృష్ణా జట్టు



సుశాంత్‌నాయుడు, 86 నాటౌట్ (కృష్ణా)

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్-23 క్రికెట్ పోటీలలో భాగంగా బుధవారం కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కృష్ణా జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో తొలిరోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది. జట్టులోని అనంత్‌కార్తికేయ 106 బంతుల్లో 10 ఫోర్లతో 61 పరుగులు సాధించాడు. సుశాంత్‌నాయుడు 165 బంతుల్లో 15 ఫోర్లతో 86 పరుగులతో క్రీజ్‌లో నిలిచాడు. పశ్చిమ గోదావరి బౌలర్ దీపక్‌చంద్‌కు 2 వికెట్లు లభించాయి. గురువారం రెండవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

కొండచిలువ పట్టివేత



మార్టూరు: ఇళ్ల సమీపంలో ఉన్న పది అడుగుల కొండచిలువను అధికారులు పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు. కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ కథనం మేరకు.. మండలంలోని కోలలపూడి, తాటివారిపాలెం గ్రామాల మధ్య నివాసాల సమీపంలో బుధవారం కొండచిలువను స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులు రమేష్, శ్రీనివాసరావు అక్కడికి చేరుకున్నారు. ఓ కోడిని తిని కదలలేని స్థితిలో ఉన్న కొండచిలువను బంధించారు. నాగరాజుపల్లి గ్రామ పరిధిలోని కొండపై అటవీ ప్రాంతంలో వదిలివేశారు. అధికారి రమేష్ మాట్లాడుతూ.. అడవులు, కొండల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో వన్యప్రాణులు ఇళ్ల మధ్యకు వస్తున్నాయని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని గుర్తుచేశారు.

చిన్నారులకు వైద్యం.. ఉచితం ప్రత్యేకం

- 'ప్రత్యేక' బాలలకు పలు చికిత్సలు
- అందుబాటులో విభాగాల నిపుణులు
- జిల్లా సత్వర చికిత్సా కేంద్రం ప్రత్యేకత

నరసరావుపేట: పల్నాడు రోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న జిల్లా సత్వర చికిత్సా కేంద్రం ప్రత్యేక అవసరాల పిల్లలకు అండగా నిలుస్తోంది. నేషనల్ హెల్త్ మిషన్ సహకారంతో దీన్ని నిర్వహిస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 18 ఏళ్ల వరకు బాలల్లో లోపాలను గుర్తించి ఉచిత వైద్యసేవలు అందిస్తోంది. రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఈ సేవలు కొనసాగుతున్నాయి.

వివిధ రకాల సమస్యలకు వైద్యం

పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలైన గ్రహణ మొర్రి, వెన్నుపూస సమస్యలు, గుండె జబ్బులు, చెవి, ముక్కు, గొంతు, కంటి ఇబ్బందులు, వంకర పాదాలు, పోషకాహార లోపం, చర్మవ్యాధులు, రుమాటిక్ గుండె వ్యాధి, శ్వాసకోశ సంబంధిత వ్యాధి, పిప్పిపళ్లు, మూర్ఛవ్యాధి, వైకల్యంతో శారీరక, మానసిక అభివృద్ధి ఆలస్యం, అతి చురుకు సమస్యలు, తలసేమియా, బ్రెయిన్ డామేజ్ వంటి వాటికి చికిత్స ఉచితంగా అందిస్తారు. మానసిక, శారీరక వైకల్యాన్ని గుర్తించి తగిన వైద్యం చేస్తారు. ఆపరేషన్ అవసరమైన వారిని ముందుగా ఒప్పందం కుదుర్చుకున్న హాస్పిటల్స్‌కు తరలిస్తారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న బెరాటెస్ట్ ఈ జిల్లాలో ఇక్కడ మాత్రమే ఉచితంగా చేస్తారు. తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ స్క్రీనింగ్ ఉచితంగా చేయించవచ్చు. అభ్యాసన లోపం కలిగిన పిల్లలకు శిక్షణనిస్తారు. చిన్నారుల్లో లోపాలను గుర్తించేందుకు ఆటపాటల్లో నిమగ్నం అయ్యేలా చేస్తారు. దీనికి అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. చదువులో వెనుకబడిన చిన్నారులకు సైకాలజిస్ట్ సేవలు ఉచితం. స్పెషల్ ఎడ్యుకేషన్, స్పీచ్ థెరపీ తరగతులు కూడా నిర్వహిస్తారు.



వైద్యం చేస్తున్న నోడల్ అధికారి డాక్టర్ రాజేశ్వరి

సద్వినియోగం చేసుకోండి



జిల్లా సత్వర చికిత్సా కేంద్రంలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం అమలుకు జిల్లా కేంద్రంగా ప్రోగ్రాం ఆఫీసర్ ఉంటారు. వారి పరిధిలో వైద్య బృందం సేవలు అందిస్తోంది. పీడియాట్రిషన్ మెడికల్ ఆఫీసర్, డెంటల్ ఆఫీసర్, ఫిజియోథెరపిస్ట్, చైల్డ్ సైకాలజిస్ట్, ఆప్టోమెట్రిస్టు, ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ పెథాలజిస్ట్, స్పెషల్ ఎడ్యుకేటర్, స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, సోషల్ వర్కర్ ఇక్కడ సిబ్బందిగా ఉన్నారు. బాధిత బాలలు ఉచిత వైద్యం పొందొచ్చు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ బి.రవి, డీఎంహెచ్‌వో

ఆకట్టుకున్న 'ఫిట్ ఇండియా స్కూల్' అక్షరాకృతి



ఫిట్ ఇండియా స్కూల్ అక్షరాకృతిలో ఏఎంజీ హైస్కూల్ విద్యార్థులు

చిలకలూరిపేట: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఎంజీ హైస్కూల్ విద్యార్థులు బుధవారం ఏర్పాటు చేసిన ఫిట్ ఇండియా స్కూల్ అక్షరాకృతి ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు వారితో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. క్రీడల ఆవశ్యకత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, స్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ పాల్గొన్నారు.

పెన్షన్ స్కీంకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులపై బలవంతంగా రుద్దనున్న యూనిఫైడ్ సర్వీస్ పెన్షన్(యూపీఎస్)కు వ్యతిరేకంగా సెప్టెంబర్ ఒకటిన నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీపీఎస్ తరహాలో యూపీఎస్‌ను వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి 50 శాతం పెన్షన్‌తో అమలు చేస్తామని చెప్పడం లక్షలాది కేంద్ర ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. జీపీఎస్ అయినా, యూపీఎస్ అయినా ఉద్యోగి కాంట్రిబ్యూషన్ లేకుండా లేదన్నారు. ఉద్యోగి తన జీతం నుంచి ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ అసంబద్ధ సంక్షేమ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ ఒకటిన గుంటూరు, పొన్నూరు, తెనాలి, మంగళగిరి తాలుకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపడతామని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

ఏపీజీఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా



గుంటూరు మెడికల్: 11వ వేతన సవరణ ముగిసి ఇప్పటికీ 14 నెలలు గడిచినా 12వ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవటం దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా అభిప్రాయపడ్డారు. బుధవారం గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో జిల్లా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. సమావేశంలో చాంద్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వం వేతన సవరణ కమిటీని నియమించలేని పక్షంలో 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులు 14 నెలలు నష్టపోయినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 12వ వేతన సవరణ కమిటీకి రిటైర్డ్ హైకోర్టు జడ్జిని నియమించాలని కోరారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు వేతన సవరణ కమిటీ నియమించటం ఆలస్యమైతే ఐ.ఆర్.ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీముల్లా షా ఖాదరి, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పెద రత్తయ్య, ఫిరంగిపురం తాలూకా యూనిట్ అధ్యక్షుడు రాజబాబు, తాడికొండ తాలూకా అధ్యక్షుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

సత్తెనపల్లి: కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి నూతన చట్టం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు అన్నారు. సెప్టెంబర్ 5న విజయవాడలో నిర్వహించనున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర సదస్సుకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో బుధవారం జరిగిన సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం నాయకుడు టి. హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. కౌలు చట్టంలో లోపాలను గుర్తించాలని, అందరికీ కార్డులు ఇచ్చేలా కొత్త చట్టం రూపొందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి వై. రాధాకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో కౌలు కార్డుదారులందరికీ పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమంపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వ్యాఖ్యలను సమావేశం ఖండించింది. సమావేశంలో సంఘం నాయకులు జి.పిచ్చారావు, పి.మహేష్, అమర లింగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, తాతారావు, రైతు సంఘం నాయకులు ఎం. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లగడపాడులో ఉద్రిక్తత

- ఇరు వర్గాల పరస్పర దాడులు
- పోలీసు పికెట్ ఏర్పాటు



సంఘటనపై విచారిస్తున్న డీఎస్పీ గురునాథ్ బాబు

పెదకూరపాడు: పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద ఇరువురు మధ్య జరిగిన వివాదం పెద్ద దుమారం రేపింది. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ జానీ, హసన్ బాజి ద్విచక్ర వాహనాలపై మినరల్ వాటర్ పట్టుకునేందుకు ప్లాంట్ వద్దకు వచ్చారు. గతంలో వారికి విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో బాజి వాహనానికి జానీ బైకు అడ్డుపెట్టారని స్వల్ప గొడవ చోటుచేసుకుంది. పరస్పరం దాడి చేసుకున్నారు. గమనించిన స్థానిక పెద్దలు సర్దిచెప్పి వారిని పంపించారు. ఇంటికి వెళ్లిన తర్వాత బాజి వర్గీయులు జానీపై దాడికి పాల్పడ్డారు. అనంతరం జానీ వర్గీయులు కూడా బాజి సంబంధికులపై రాళ్ల దాడి చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలూ నాయక్ తెలిపారు. సంఘటన స్థలాన్ని సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు పరిశీలించారు. గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు.

పరిశ్రమల్లో ప్రమాదాల కట్టడికి చర్యలు

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించేందుకు అత్యధిక ప్రాధాన్యంతో భద్రతా ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారులు, పరిశ్రమల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాద కేటగిరిలో 22 పరిశ్రమలు ఉన్నట్లు ఇటీవల నిర్వహించిన సేఫ్టీ సోషల్ ఆడిట్‌లో బయట పడిందని వెల్లడించారు. బాయిలర్, విద్యుత్, ఫ్యాక్టరీస్, అగ్నిమాపక శాఖ తదితర అంశాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారన్నారు. ప్రమాద జోన్‌లో ఉన్న పరిశ్రమల యజమానులు నిర్దిష్ట ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా రసాయనాలు నిల్వ ఉంచే అంశాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్మికులకు మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రమాద స్థాయిలో ఉన్న పరిశ్రమల్లో కార్మికులకు వ్యక్తిగత భద్రతా కిట్‌లు అందజేయాలని సూచించారు. పరిశ్రమల్లో అంతర్గత సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి భద్రతా చర్యలు పర్యవేక్షించాలని వివరించారు. కార్మికులు సేఫ్టీ కల్చర్ అలవర్చుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పరిశ్రమల నిర్వహణలో ఇబ్బందులను ముందుగానే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పరిశ్రమల యజమానులు నిర్లక్ష్యంతో కార్మికులకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా, ప్రమాదం ఏర్పడినా కఠిన చర్యలకు వెనుకాడబోమని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో ఇండస్ట్రీస్ జీఎం ఆర్.వెంకట్రావు, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం.వి.శివకుమార్‌రెడ్డి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు డిమాండ్



జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్ష

లక్ష్మీపురం: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షనుద్దేశించి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 2023 నవంబర్ నుంచి మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ జిల్లాకు దాదాపు పది కోట్ల రూపాయలు మెస్ , కాస్మోటిక్ చార్జీలు పెండింగ్లో ఉన్నాయని వివరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె పవన్ తేజ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు షేక్ కరీం, ఉపాధ్యక్షులు తిరుమలరావు పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, కిరణ్, నవ్యశ్రీ, శివా, అభి, దుర్గా సాయి, అజయ్, వెంకట్, రాహుల్, డేవిడ్, అమర్నాథ్, గణేష్, విక్రమ్, కిరణ్, గౌతమ్, సుభాని, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 10 మంది అరెస్ట్



క్రోసూరు: మండలంలోని పెరికపాడు గ్రామ శివారులో క్రోసూరు ఎస్‌ఐ షఫీ ఆధ్వర్యంలో బుధవారం దాడులు చేసి 10 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. తమకు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేశామని చెప్పారు. వారి నుంచి 11 బైకులు, 10 సెల్‌ఫోన్లు, రూ. 47,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సీనియర్ క్రీడాకారుడు శ్యామ్ ఎడ్విన్ మృతి



నరసరావుపేట: ప్రముఖ బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడాకారుడు శ్యామ్ ఎడ్విన్ (63) బుధవారం పట్టణంలోని తన స్వగృహంలో కన్నుమూశారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎడ్విన్ మృతికి సహచర క్రీడాకారులు, మిత్రులు, ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ ఫరీద్, చైర్మన్, ఏఎస్ఐ గుడ్లూరి అంజనేయులు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పురుషోత్తమ రాజు, సీబీఐ అధికారి సాంబిరెడ్డి, జమ్ముల రాధాకృష్ణ, పట్టణ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దమ్ము ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



ప్రభుదాసు (ఫైల్)


ఈపూరు: దమ్ము చక్రాల ట్రాక్టర్ తిరగబడి డ్రైవరు మృతి చెందిన ఘటన మండలంలోని అగ్నిగుండాల గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మాచర్ల ప్రభుదాసు (45) పొలంలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా వెనుకభాగం బురదలో కూరుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రభుదాసు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రభుదాసుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెల్లని చెక్కు కేసులో నిందితులకు జైలు

మంగళగిరి: చెల్లని చెక్కు కేసులో ముద్దాయికి జైలు శిక్ష పడింది. బుధవారం కోర్టు వెలువరించిన తీర్పు వివరాలు.. పట్టణంలోని కొండపనేని టవర్స్‌లో నివాసముంటున్న నాగళ్ల రవీంద్రబాబు అనే రైతు భట్టిప్రోలుకు చెందిన అక్షయ ఫెర్టిలైజర్స్ నిర్వాహకుడు మాదల ప్రవీణబాబు వ్యాపారం నిమిత్తం 1830 కిలోల మొక్కజొన్నలు రూ.6,10,400లకు కొనుగోలు చేశారు. అనంతరం పార్ట్ పేమెంట్ కింద రూ.5.80 లక్షలకు చెక్కు ఇవ్వగా సదరు చెక్కులను ఫిర్యాది రవీంద్రబాబు మంగళగిరిలోని ఐసీఐసీఐ బ్యాంకులో జమ చేయగా చెక్కు బౌన్స్ అయింది. అనంతరం రవీంద్రబాబు కోర్టులో ప్రవీణ్‌బాబుపై కేసు వేయగా వాదోపవాదాల అనంతరం జడ్జి సురేష్‌బాబు నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు బాధితుడికి రూ.5.80 లక్షలు కాంపనేషన్ చెల్లించాలని తీర్పు వెలువరించారు. అదే విధంగా నూతక్కి గ్రామానికి చెందిన అవుతు శ్రీనివాస్‌రెడ్డి నుంచి బి.అరుణారెడ్డి రూ.3 లక్షలు తీసుకుని ఆ మొత్తానికి చెక్కు ఇవ్వగా నూతక్కి బ్యాంక్‌లో జమ చేయగా చెక్కు బౌన్స్ అయింది. ఫిర్యాది శ్రీనివాస్ రెడ్డి మంగళగిరి కోర్టులో కేసు వేయగా అరుణారెడ్డికి ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ.3 లక్షల కాంపనేషన్ చెల్లించాలని జడ్జి సురేష్‌బాబు తీర్పు వెలువరించారు.

మద్యం మత్తుకు నిండు ప్రాణం బలి

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



జె.పంగులూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలోని ఫ్లై ఓవర్‌పై మంగళవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో బల్లికురవ మండలంలోని కొణిదెన గ్రామానికి చెందిన జనరాజు పల్లి మరియదాసు (30) మరణించాడు. రేణింగవరం ఎస్‌ఐ బి.వినోద్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. జనరాజుపల్లి మరియదాసు, జనరాజుపల్లి నవీన్‌లు పూటుగా మద్యం సేవించి మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై బైక్‌పై మార్టూరు నుంచి ఒంగోలు వైపు వెళుతున్నారు. ఫ్లై ఓవర్ మీదుగా వెళుతుండగా ముందు వెళుతున్న వాహనాన్ని క్రాస్ చేయబోయి, అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం మరియదాసు రెండు కాళ్ల మీదుగా వెళ్లింది. క్షతగాత్రులను 108 సిబ్బంది ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మరియదాసు మృతి చెందాడు. నవీన్‌కు గాయాలయ్యాయి. రేణింగవరం ఎస్‌ఐ వినోద్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు జాబ్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు గుజ్జనగుండ్ల సర్కిల్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే మేళాలో ఫెయిర్ డీల్ క్యాపిటల్, జాస్పర్ ఇండస్ట్రీస్, ముత్తూట్ ఫిన్‌కార్ప్, సోల్టర్ హెచ్ఆర్, జెన్‌డ్రాయిట్ ఎస్ఆర్ సొల్యూషన్స్, సార్య బిజినెస్ సొల్యూషన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, పేటీఎం సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతలు, ఆధార్ జిరాక్స్ కాపీలతో రావాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 98668 22697, 87907 90762 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.